## క్లుప్తంగా

### యూరియా కరువు

పర్వతగిరి : మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. మొత్తం 33 గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్న దుస్థితి నెలకొంది. అవసరమైన మేరకు యూరియా ఇవ్వడానికి ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు నిరాకరించడంతో రైతులు వేదనకు గురవుతున్నారు. డీఏపీ, ఇతర పురుగు మందులు తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు మెలిక పెడుతుండడంతో అవసరం లేకున్నా వేలాది రూపాయలు వెచ్చించి డీఏపీ, పురుగు మందులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఫర్టిలైజర్ షాపుల యజమానుల యూరియాను అధిక ధరకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలుస్తోంది. ఇకనైనా వ్యవసాయ, ఇతర సంబంధిత శాఖల అధికారులు స్పందించి యూరియా అధిక ధరకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు పంటల సాగుకు అవసరమైన మేరకు యూరియా అందించే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : పట్టణంలో నేడు (శనివారం) సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ విజయభాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### దుప్పట్ల పంపిణీ



నెక్కొండ : చలి తీవ్రత నేపథ్యంలో మండలంలోని పెద్దకోర్పోలులోని కేజీబీవీలో 149 మంది విద్యార్థులకు ఎంఈఓ రత్నమాల శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువులో మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థులు చొరవ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాలయ ఇన్‌చార్జ్ ఎస్ఓ గంగ, మహేశ్వరి, సరిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### కార్యవర్గం ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలో ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సద్ది మహేందర్, ఉపాధ్యక్షుడిగా గిన్నె మోహన్, ప్రధాన కార్యదర్శిగా నరిగె భిక్షపతి, కార్యదర్శిగా కస్తూరి స్వామి, కోశాధికారిగా యార సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు అభినందించి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

### పేస్కేల్ అమలు చేయాలి

సంగెం : సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పర్వతగిరి, సంగెం మండలాల బయో సైన్స్ కాంప్లెక్స్ సమావేశంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు అర్హత, రిజర్వేషన్, రోస్టర్ కం మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా నియమితులైన క్రమంలో వెంటనే వారి సమస్యలను పరిష్కరించి రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సదుపాయాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

### నివాళి

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కాసాని కనుకయ్య (48) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి గ్రామ ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు పులి దేవేందర్ శుక్రవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని దేవేందర్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కాసాని రవి, తోటకూరి కోటి, వట్టె రవికుమార్, శ్రీను, ఇందిర, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

### సెమీ క్రిస్మస్ వేడుకలు



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది విజయ గోపాల్‌రెడ్డి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమని చెప్పారు. విద్యార్థులు పండుగల విశిష్టత తెలుసుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలరాజు, కందిక నవీన్, మేకల విష్ణు, శైలజ, వల్ల వేణు, మేడి రమేశ్, రమేశ్, శ్రీను, కవిత పాల్గొన్నారు.

# మరుగుదొడ్లు లేక వెతలు

- కానరాని పబ్లిక్ టాయిలెట్లు
- మహిళలు, వృద్ధులకు మరిన్ని తిప్పలు
- అధికారుల నిర్లక్ష్యం



యూనియన్ బ్యాంకు వద్ద మహిళలు, పురుషులు

సంగెం : మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం ప్రయాణికులు పరుగు పెడుతున్న పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్, ఇతర ప్రధాన కూడళ్లలో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో మహిళలు, వృద్ధులకు తిప్పలు తప్పడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం ఎటు వెళ్లాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాటసారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రభుత్వాలు మారినా ప్రయోజనం శూన్యం**

మండలంలో 33 గ్రామపంచాయతీలు, శివారు తండాలున్నాయి. యూనియన్ బ్యాంకు, ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు, రెవెన్యూ, మండల పరిషత్, తదితర కార్యాలయాలతోపాటు ప్రభుత్వ ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్, పశువుల ఆస్పత్రి, 2 మీ సేవా కేంద్రాలున్నాయి. వరంగల్, తీగరాజులపల్లి, తదితర ఆటో అడ్డాలున్నాయి. వివిధ పనుల మీద రోజూ రైతులు, వ్యాపారస్తులు, కార్మికులు రావడం పరిపాటి. ఉదయం 10 గంటలకు వచ్చిన వ్యక్తులు పనులు పూర్తికాక సాయంత్రం 5 గంటల వరకు ఉండాల్సిన పరిస్థితుల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలకు వెళ్లాల్సి వస్తే ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్, తదనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా టాయిలెట్లు ఏర్పాటు చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఇబ్బంది పడుతున్నాం**



నిత్యం మహిళ సంఘాల సభ్యులు బ్యాంకులకు, ఇతర అవసరాలకు మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. బ్యాంకు లింకేజీ రుణాల కోసం గ్రూపుల సభ్యులు వస్తే సాయంత్రం వరకు ఉండక తప్పదు. ఈ పరిస్థితిల్లో టాయిలెట్‌కు వెళ్లాలంటే ఎటు పోవాలో తెలియక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రధాన కూడళ్లలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి.

- మంగమ్మ, మహిళా సంఘం నాయకురాలు

**ప్రతిపాదనలు చేశాం**



మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి చాలా కాలంగా డిమాండ్ ఉంది. ఉపాధి హామీ పథకం కింద పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పబ్లిక్ టాయిలెట్లతోపాటు వ్యాపారం కోసం గది నిర్మిస్తే వ్యాపారం చేసుకుంటూ ఒకరు నిర్వహణ చేపట్టేలా ప్రతిపాదన చేశాం. ప్రభుత్వ అనుమతి రాగానే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

- కొమురయ్య, ఎంపీఓ, సంగెం

## అమిత్ షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ



వర్ధన్నపేట: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ఎస్ అంబేడ్కర్‌ను కించపర్చేలా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేశారంటూ నిరసనలు వెల్లువెత్తాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె రమేశ్ మాట్లాడారు. భారతదేశం సహా ప్రపంచ దేశాలు గౌరవిస్తున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు మాట్లాడడం దారుణమన్నారు. వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జం పాపారావు, బంగారు సదానందం, బందెల ప్రవీణ్, కొమ్మాలు, స్వామి, లింగాల రంజిత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి తుప్పరి నర్సింహస్వామి, మండల అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, నాయకులు దొడు మొగిలి, కోట చేరాలు, పసుల కుమార్, మొగిలి, లింగమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని చంద్రుగొండ, నాగారం గ్రామాల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు పొనగంటి యాకయ్య, దార్ల అనిల్, కుమారస్వామి, బక్కి శివకుమార్, పసుల అశోక్, బక్కి రాకేశ్, పృథ్వీరాజ్, దాసరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

**సీపీఎం ఆధ్వర్యంలో..**

చెన్నారావుపేట : సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పరికి మధూకర్ మాట్లాడారు. కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. ప్రధాని మోదీ సైతం వత్తాసు పలికారని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ సభ్యులు ఏనుగుతల నరేశ్, జన్ను రమేశ్, ఐలయ్య, జన్ను రవి, బాషు మియా, మధు, తదితరులు పాల్గొన్నారు.

**అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం**

నల్లబెల్లి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కోర్నెల్ మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబయ్య, వీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి పులి రమేశ్, నాయకులు ఆంగోత్ వీరన్న, పవన్, ప్రశాంత్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### క్షీరాభిషేకం



ఖానాపురం : ప్రభుత్వం రైతులకు బోనస్ అందిస్తున్న సందర్భంగా మండలంలోని మంగళవారిపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు మాట్లాడారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందు వరసలో ఉంటుందన్నారు. మంగళవారిపేట భూములకు పట్టాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాఅగరాజు, కొంరయ్య, వెంకన్న, కుమారస్వామి, లింగయ్య, మల్లేశ్, సునీల్, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటానికి..**

వర్ధన్నపేట : పట్టణ పరిధిలోని డీసీ తండాలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటానికి నాయకులు ఆంగోతు లచ్చిరాం, కీమా నాయక్, తారాబాయి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 17న అసెంబ్లీలో స్థానిక మునిసిపాలిటీ పరిధి నుంచి డీసీ తండాతోపాటు ఏడు తండాలను తొలగించి వాటిని పంచాయతీలుగా గుర్తించాలని ఎమ్మెల్యే నాగరాజు కోరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలో తండాలను మునిసిపల్ పరిధిలోంచి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, వీరన్న, రాజేందర్, వెంకట్రాం నాయక్, రమేశ్, సరోజ, సుమన్, జ్యోతి, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకుల అరెస్టు అప్రజాస్వామికం



దుగ్గొండి : మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

నర్సంపేట రూరల్ : సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఉద్యమిస్తున్న ఆటో యూనియన్ల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ అన్నారు. పలువురు ఆటో యూనియన్ నాయకులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా వారిని యువరాజు, లక్ష్మీనారాయణ పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం ఆటోకార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని, సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి ఆటోకార్మికుల బతుకులను బజారు పాల్జేసిందని ఆందోళన వెలిబుచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బతుకులు బాగుపడతాయని ఆశించిన ఆటోకార్మికులు కుటుంబాలతో పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు.నవతెలంగాణ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీను, గౌరవ సలహాదారు పెండెం వెంకటేశ్వర్లు, మాదన్నపేట అడ్డ అధ్యక్షుడు నర్సయ్య, కరుణాకర్, సాయి, ప్రేమ్‌లను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. ప్రభుత్వ తప్పుడు విధానంతో ఏడాది వ్యవధిలో 28 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి అండగా నిలవాలని, ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల భృతి కల్పించాలని డిమాండ్ చేశారు.

దుగ్గొండి : ఆటోడ్రైవర్లు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జేఏసీ జిల్లా నాయకుడు మోడెం విద్యాసాగర్ మాట్లాడారు. ఆటో యూనియన్ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఆటోకార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షుడు బూర రామకృష్ణ, నాయకులు వంగరి గణేశ్, బుర్రి స్వామి, దండు రాజు, గోవిందు అశోక్, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ఉన్నతే ధ్యేయం



రాయపర్తి : విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా పూర్వ విద్యార్థులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. మండలంలోని కొత్తూరు హైస్కూల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా పూర్వవిద్యార్థి రాయపాటి వేణు సహకారంతో రూపొందించిన 50 ఏళ్ల పాఠశాల పురోగతి సావనీర్ పుస్తకాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఓనమాలు నేర్పిన పాఠశాలల మూలాలు మరువద్దని పూర్వవిద్యార్థులను కోరారు. పూర్వవిద్యార్థుల స్ఫూర్తిని నేటి విద్యార్థులు ఆచరించి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని సూచించారు. భావితరాలకు స్ఫూర్తినిచ్చే దిశగా సావనీర్ దోహదపడుతుందని తెలిపారు.

### రైతులకు అందుబాటులో ఆర్ఎన్ఆర్ విత్తనాలు

ఖానాపురం : రైతులకు సబ్సిడీపై అందించేందుకు ఆర్ఎన్ఆర్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఆర్ 508 (తెలంగాణ సోనా) ఎన్ఎఫ్ఎస్ఎం పథకంలో భాగంగా సబ్సిడీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అవసరం ఉన్న రైతులు రైతువేదికలో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో వచ్చి తీసుకోవాలని సూచించారు.

## అయ్యప్పస్వామికి అభిషేక పూజలు



నైవేద్యం తీసుకొస్తున్న అన్నదాతలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకులు అయ్యప్పస్వామికి శుక్రవారం ఘనంగా అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంద్రు వనజ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, గురిజాల అయ్యప్పస్వాములు మర్రి యాదగిరి, రంజిత్, రాజు, రమేశ్, కల్పన, కొనకటి రాణి వెంకటరెడ్డి, రజనీకాంత్, శ్రీనివాస్, నాడెం సరిత శ్రీనివాస్, నాంపల్లి సుహాసిని శ్యాంప్రసాద్, వీరంటి రమేశ్ రమాదేవి, వేల్పుల అనిత కృష్ణ, బోగోజు కల్పన రాజు, పలకల సృజన మల్లేశ్వర్‌రెడ్డి, గంట కోమల శ్రీనివాస్‌రెడ్డి, కొక్కు స్రవంతి శివ, లింగాల సునీత వెంకన్న అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, శ్రీరాముల శంకరయ్య, చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, వజినేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

నర్సంపేట : మునిసిపాలిటీల్లో అనేక ఏళ్ల తరబడిగా పని చేస్తున్న ఎన్ఎంఆర్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సానుకూలంగా పరిష్కరించాలని అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు ఎండి.మాషుక్ ఎమ్మెల్యేలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమాన వేతనం అందించాలని, నెలకు రూ.26 వేల చొప్పున వేతనం చెల్లించాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద రూ.5 లక్షలు అందజేయాలని, పదేళ్ల సర్వీస్ ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు ఇతర అన్ని సమస్యలనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



చెన్నారావుపేట : నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



దుగ్గొండి : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- ఎంపీడీఓ నల్ల శ్రీవాణి

చెన్నారావుపేట : ప్రభుత్వ ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ నల్ల శ్రీవాణి కోరారు. మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలోని జీపీ నర్సరీని, ప్రభుత్వ స్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీలో మొక్కలు నాటడానికి తెచ్చిన మట్టిని బ్యాగులలో నింపాలని సూచించారు. మొక్కల రక్షణను బాధ్యతగా భావించాలని చెప్పారు. స్కూల్‌లో తనిఖీ సందర్భంగా ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి చేరాలు, ఫీల్డ్ అసిస్టెంట్ ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ సర్వే పరిశీలన**

దుగ్గొండి : మండలంలోని మందపల్లి, మల్లంపల్లి, రాజ్యతండా, మదిర, అడవి రంగాపురం, గిర్నిబావి గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీఓ అరుంధతి తనిఖీ చేశారు. సర్వే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సూచనలు చేశారు. పారదర్శకంగా సర్వే చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, స్రవంతి, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తిప్రదాత



రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : గణిత పితామహుడు శ్రీనివాస రామనుజన్‌ను స్ఫూర్తిప్రదాతగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అభివర్ణించారు. ఆ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవ వేడుక సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి అధ్యాపకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమి మీద జీవం ఉన్నంత వరకు శ్రీనివాస రామానుజన్ పరిశోధన ఫలాలు మానవాళికి ఉపయోగపడతాయని తెలిపారు. శ్రీనివాస రామానుజన్ కడు పేద కుటుంబంలో జన్మించి కష్టపడి ఉన్నత స్థానానికి ఎదిగారని తెలిపారు. భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. శ్రీనివాస రామానుజన్ సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని గణితంలో రాణించాలని సూచించారు. అనంతరం గణిత శాస్త్ర విభాగ అధిపతి రుద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడారు. గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, స్టాఫ్ సెక్రటరీ సోమయ్య, అధ్యాపకులు రాంబాబు, రహీముద్దీన్, రాజీరు, గాయత్రి, సంధ్య, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులకు కుట్ర

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ప్రతిపక్ష పార్టీల నేతలపై అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-కార్ రేస్ ద్వారా హైదరాబాద్ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా పెంచిన మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించారని చెప్పారు. మునిసిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఐటీతోపాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని తెలిపారు. ఈ-రేస్ ఫార్ములా అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టడానికి ప్రభుత్వం ఎందుకు జంకుతోందని ప్రశ్నించారు. స్థానిక మునిసిపాలిటీపై ఎమ్మెల్యే ఏడాది కాలంలో తీసుకొచ్చిన నిధులేమీ లేవని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి నిధుల పనులను నిలిపేసి టెండర్లు రద్దు చేశారని, ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌గా కొత్తగా టెండర్లు వేసి బీఆర్ఎస్ హయాలో మంజూరు చేసిన నిధులనే చూపిస్తున్నారని తెలిపారు. పాకాల ఆడిటోరియంను ప్రారంభించడం లేదని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పూర్తి చేయడం లేదని చెప్పారు. సీఎం, ఎమ్మెల్యే మధ్య ఉన్న పంచాయతీతో నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బండి రమేశ్, వేములపల్లి ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ గర్భధారణతో పశుగణాభివృద్ధి



నెక్కొండ : మందులు అందజేస్తున్న వైద్యురాలు



సంగెం : మినరల్ మిక్చర్ అందిస్తున్న డాక్టర్ రాజు

- పశు వైద్యాధికారి డాక్టర్ మమత

నెక్కొండ : కృత్రిమ గర్భధారణతో పశుగణాభివృద్ధి జరుగుతుందని మండల పశు వైద్యాధికారి మమత తెలిపారు. మండలంలోని బంజరుపల్లిలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో పలు పశువులకు వైద్యసేవలు అందించారు. అలాగే పాడి రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత మాట్లాడారు. పశువుల ఉత్తమ జన్యు లక్షణాల అభివృద్ధి, పాల ఉత్పత్తి పెంచడానికి లింగ నిర్ధారణ జరిగిన వీర్యాన్ని వేయించాలని సూచించారు. పశువులకు లింగ నిర్ధారణ చేసిన వీర్యం అందుబాటులో ఉందన్నారు. దాని ద్వారా 95 శాతం ఆడదూడలు జన్మిస్తాయని స్పష్టం చేశారు. పశువుల్లో ఎద లక్షణాలను సకాలంలో గుర్తించి సూదులు వేయించాలని సూచించారు. పాడి పశువులకు గర్భకోశ, సాధారణ చికిత్స చేయడంతోపాటు లేగ దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ మరళి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రఘువీర్, గోపాలమిత్రలు రావుల రాజు, రామరాజు, భిక్షపతి, పశుమిత్రలు శారద, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని తిమ్మాపూర్‌లో పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు మాట్లాడారు. శిబిరంలో పశువులకు గర్భకోశ చికిత్స చేయడంతోపాటు దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ అనిల్, గోపాలమిత్రలు బాబు, వీరేశం, రాజు, తదితరులు పాల్గొన్నారు.